


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
18 అక్టోబర్ 2024
పేజీలు: 02




## 23న తెలంగాణ కేబినెట్ భేటీ

తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఖరారరైంది. అక్టోబర్ 23న రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రవర్గం భేటీ కానుంది. 23న సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం జరగనుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా చట్టబద్ధంగా మారడం, హైడ్రా ఏర్పాటును హైకోర్టు సమర్థించడం వంటి అంశాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం.అంతేగాక, మూసీ నది ప్రక్షాళన, రైతు భరోసా విధి విధానాలు, శీతాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై కేబినెట్ డిస్కస్ చేయనున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి ఒక ఎకరానికి రూ. 15 వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.



## ఇంకా పేదరికంలోనే మగ్గుతున్న ప్రజలు

భారత్ చాలా ధనిక దేశమని మనకు తెలిసిన చరిత్ర. కాని బ్రిటిష్ వాళ్లు వచ్చాక భారత్ సంపద .. ఖండాంతరాలు దాటిందనేది మనకు తెలిసిన విషయం . కాని బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయి ...మన దేశానికి స్వతంత్యం వచ్చి దాదాపు 75 ఏండ్లు అవుతుంది. అయినా ఇంకా భారత్ లో కూటికి కష్టపడే వాళ్లు చాలా మంది ఉన్నారని తెలిపుతుంది సర్వేలు.దేశంలోని 142 కోట్ల మంది జనాభాలో 9 శాతం మందికిపైగా ప్రజలు కటిక పేదరికంలో మగ్గుతున్నట్టు వరల్డ్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. 2024 నాటికి దేశంలో మొత్తం 12.9 కోట్లమంది అత్యంత పేదరికంలో ఉన్నట్టు తెలిపింది. దీనిని బట్టి భారత్ ఇంకా చాలా దీన స్థితిలోనే ఉందని సర్వేలు చెబుతున్నాయని క్లారిటీ ఇచ్చారు. జనాభాపరంగా చూస్తే 1990 లో కంటే 2024లోనే అత్యధిక మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని పేర్కొన్నది. పేదరికానికి జనాభా పెరుగుదలే ప్రధాన కారణమని వెల్లడించింది. ప్రస్తుత దేశ పురోగతిని చూస్తే.. అత్యంత పేదరికాన్ని నిర్మూలించేందుకు ఇంకా దశాబ్దాల కాలం పడుతుందని తెలిపింది. ఇందులో చాలా మంది ప్రజలు రోజు సంపాదన దాదాపు రూ.121 కంటే తక్కువగానే ఉందని ఈ సర్వే ద్వారా తెలుస్తుంది.

# హర్యానా సీఎంగా నయాబ్ సింగ్ సైనీ



హర్యానా కొత్త సీఎంగా నాయబ్ సింగ్ సైనీ(54 ) రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం చండీగఢ్ సమీపంలోని పంచకుల పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ బండారు దత్తాత్రేయ సైనీతో ప్రమాణం చేయించారు. ఇద్దరు మహిళలతో సహా 13 మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ దండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శృతి చౌదరి(మహిళ), శ్యామ్ సింగ్ రాణా, రణబీర్ సింగ్ గాంగ్వా, క్రిషన్ బేడీ, గౌరవ్ గౌతమ్, ఆర్తి సింగ్ రావు(మహిళ), రాజేశ్ నగర్ లతో హర్యానా కొత్త కేబినెట్ ఏర్పడింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, రాజీవ్ రంజన్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు, ఎన్డీయే కూటమి పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. మొత్తం 18 మంది సీఎంలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ప్రజలు అటెండ్ అయ్యారు. ప్రముఖ నేతలంతా అటెంట్ కావడంతో పంచకుల పరేడ్ గ్రౌండ్ వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు సైనీ, బీజేపీ ఎమ్మెల్యేలు పంచకులలోని వాల్మీకి ఆలయం, గురుద్వారా, మానస దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్త ప్రభుత్వం ఓ అద్భుత మిశ్రమం: మోదీ

హర్యానా కొత్త ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం నాయబ్ సింగ్ సైనీ, ఆయన మంత్రివర్గ సహచరులను అభినందించారు. హర్యానా కొత్త టీం సుపరిపాలన, అనుభవంతో కూడిన అద్భుత మిశ్రమమని ప్రశంసించారు. సైనీ ప్రభుత్వం హర్యానా ప్రజల కలలను సాకారం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు.

సైనీకి 30 ఏండ్ల రాజకీయ అనుభవం

ఓబీసీ వర్గానికి చెందిన సైనీ 1970 జనవరి 25న అంబాలాలో జన్మించారు. అంబేద్కర్ బీహార్ విశ్వవిద్యాలయం, చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం నుంచి తన డిగ్రీ, న్యాయ పట్టాలను పొందారు. 1996 నుంచి బీజేపీ హర్యానా యూనిట్‌లో చురుకుగా పనిచేస్తున్నారు. 2002లో పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మొదటిసారిగా 2014లో నరైంఘర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2016లో ఖట్టర్ కేబినెట్‌లోకి ప్రవేశించారు. 2019 కురుక్షేత్ర లోక్‌సభ నుంచి పోటీచేసి గెలిచారు. అప్పటి నుంచే ఆయనకు పార్టీలో ప్రాముఖ్యత పెరిగింది. 2023 అక్టోబర్‌లో హర్యానా బీజేపీ చీఫ్‌గా నియమితులయ్యారు. 2024 మార్చి 12న సైనీ తొలిసారి సీఎంగా ప్రమాణం చేశారు. ఇక ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ బీజేపీ అనూహ్య విజయాన్ని అందుకుంది.



## ఫైనల్‌కు దూసుకెళ్లిన సౌతాఫ్రికా

దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీ ఫైనల్‌లో ఆసీస్‌పై సౌతాఫ్రికా ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సౌతాఫ్రికా వన్‌డౌన్ బ్యాటర్ అన్నేకే బోష్ (74*; 48 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) దంచికొట్టింది. ఓపెనర్ లారా వోల్వార్డ్ట (42; 37 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. శుక్రవారం మరో సెమీ ఫైనల్‌లో వెస్టిండీస్, న్యూజిలాండ్ తలపడనున్నాయి. ఫైనల్ ఆదివారం (అక్టోబర్ 20న) జరగనుంది.



## ఓటీటీలోకి వచ్చేసిన థ్రిల్లర్ మూవీ కలి




టాలీవుడ్‌లో రీసెంట్‌గా రిలీజ్ అయిన థ్రిల్లర్ మూవీ 'కలి' బాక్సాఫీస్ దగ్గర అనుకున్న స్థాయిలో రెస్పాన్స్‌ను దక్కించుకోలేకపోయింది. ఈ సినిమాలో యంగ్ హీరో ప్రిన్స్ సిసిల్, నరేష్ అగస్త్య ముఖ్య పాత్రల్లో నటించారు. శివ శేషు డైరెక్ట్ చేసిన ఈ సినిమా అక్టోబర్ 4న థియేటర్లలో రిలీజ్ అయ్యింది. ఇక ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ లో 'కలి' మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. ఎంగేజింగ్ థ్రిల్లర్ కథ ఈ చిత్రాన్ని ఓటీటీ ఆడియెన్స్‌కి దగ్గర చేస్తుందని మేకర్స్ ఆశిస్తున్నారు. ఆత్మహత్య ఆలోచనపై ఈ సినిమా కథ నడుస్తుంది. ఈ చిత్రాన్ని లీలా గౌతమ్ వర్మ ప్రొడ్యూస్ చేయగా, జీవన్ బాబు సంగీతం అందించాడు. ఈ సినిమాలో నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, కేదార్ శంకర్, మని చందన, మధుమణి. తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.



## జేఈఈ మెయిన్‌లో ఛాయిస్ ఎత్తివేత



జేఈఈ మెయిన్ పరీక్షల్లో గత మూడేళ్ల నుంచి సెక్షన్ బీలో కొనసాగుతున్న ఛాయిస్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. జేఈఈ మెయిన్ ర్యాంకుల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 32 ఎన్‌ఐటీల్లో బీటెక్ సీట్లు భర్తీ చేస్తారు. జేఈఈ మెయిన్‌లో 75 ప్రశ్నలు...ఒక్కో దానికి 4 మార్కుల చొప్పున మొత్తం 300 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చేవారు. ప్రతి సబ్జెక్టులో ఏ, బీ సెక్షన్లు ఉండేవి. సెక్షన్ ఏలో 20 ప్రశ్నలకు మొత్తం జవాబులు రాయాలి. సెక్షన్ బీలో 10 ఇచ్చి అయిదు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేలా ఛాయిస్ ఇస్తున్నారు. ఈసారి నుంచి ఆ ఛాయిస్‌ను విరమించుకుంటున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.

## క్వార్టర్ ఫైనల్లో సింధు



డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆశలు మోస్తున్న ఏకైక షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు.. 18-21, 21-12, 21-16తో ప్రపంచ ఆరో ర్యాంకర్ హాన్ యు (చైనా)ను ఓడించి క్వార్టర్స్ చేరింది.తొలి గేమ్‌లో హోరాహోరి పోరాడినా తృటిలో ఆ గేమ్‌ను చేజార్చుకున్న సింధు.. రెండో గేమ్ నుంచి జూలు విదిల్చింది. గంటా మూడు నిమిషాల పాటు జరిగిన ఈ పోరులోని నిర్ణయాత్మక మూడో గేమ్ ఒకదశలో సింధు 8-11తో వెనుకబడ్డా అనూహ్యంగా పుంజుకుని గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది.

## నాని మూవీలో జాన్వీ?

న్యాచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ఓ మూవీ తెరకెక్కనున్నది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ రూ.100కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం సైమా, ఐఫా అవార్డులను సైతం కొల్లగొట్టింది. ఈ క్రమంలోనే నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో మరో సినిమాను తెరకెక్కించబోతున్నారు. దసరా పండుగ సందర్భంగా 'నాని ఓదెల 2' వర్కింగ్ టైటిల్‌తో సినిమా మొదలైంది. సికింద్రాబాద్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఓ పీరియాడికల్ స్టోరీని శ్రీకాంత్ సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మూవీలో హీరోయిన్ కోసం మేకర్స్ వెతుకున్నారు. వాస్తవానికి గతంలో జాన్వీ కపూర్‌ని హీరోయిన్‌గా తీసుకున్నారని ప్రచారం జరిగింది.జాన్వీ కపూర్ రెమ్యునరేషన్ విని మేకర్స్ వెనక్కి తగ్గారని వార్తలు వచ్చాయి. తాజాగా మరో బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్‌ని తీసుకోవాలని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో మూవీని తెరకెక్కిస్తున్న నేపథ్యంలో ఆ రేంజ్‌లో ఉండే హీరోయిన్ అయితేనే బాగుంటుందని దర్శక నిర్మాతలు అనుకుంటున్నారని తెలుస్తున్నంది. అయితే, శ్రద్ధాకపూర్‌ని ఫైనల్ చేశారా? లేదా? అన్నదానిపై స్పష్టత రాలేదు. కుదిరితే జాన్వీ కపూర్‌ని లేకపోతే.. శ్రద్ధాకపూర్‌ని తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారని టాక్. జాన్వీ కపూర్ 'దేవర' మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది.

## నేడు నాంపల్లి కోర్టుకు కేటీఆర్

గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవ్వాళ కోర్టుకు వెళ్లనున్నారు. కొండా సురేఖ కేసు లో భాగంగా... ఇవాళ నాంపల్లి కోర్టులో హాజరు కానున్నారు కేటీఆర్. మంత్రి కొండా సురేఖ పైన... పరువు నష్టం దావా వేశారు కల్వకుంట్ల తారక రామారావు. అయితే ఈ కేసులో ఇవాళ సాక్షాన్ని.. కోర్టు నమోదు చేసుకోనుంది. అందుకే నాంపల్లి కోర్టుకు హాజరుకానున్నారు కేటీఆర్. ఇవాళ ఉదయం 10 గంటల సమయంలో... తన కార్యకర్తలతో కలిసి కేటీఆర్ కోర్టుకు వెళ్తారు. ఇది ఇలా ఉండగా... అక్కినేని నాగార్జున మాజీ కోడలు సమంత ను కేటీఆర్ టార్గెట్ చేశాడని... ఆమె జీవితం నాశనం కావడానికి కేటీఆర్ కారణమని 15 రోజుల కిందట కొండా సురేఖ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలోనే అక్కినేని నాగార్జున ఇటు... కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు.

## రేషన్ కార్డు ఉన్నవారికి గుడ్‌న్యూస్

రాష్ట్రంలో జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న విధానం మాదిరే ఒకరికి 6కేజీల చొప్పన బియ్యం అందిస్తామన్నారు. అటు త్వరలో కొత్తగా జారీ చేసే ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. అర్హులైన నిరుపేదలనే ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

# గుండెల్ని నలిపేలా నభా అందాలు..

నభా నటేష్ డార్లింగ్ అంటూ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ క్రమంలోనే నెట్టింట్లో డార్లింగ్ సినిమాను తన స్టైల్లో ప్రమోట్ చేస్తోంది. హైద్రాబాద్‌లోని ప్రముఖ స్థలాలకు వెళ్లి పోజులు పెడుతోంది. నెట్టింట్లో అందాలను ప్రదర్శిస్తోంది. పొట్టి బట్టల్లో మెరుస్తోంది. తాజాగా నభా నటేష్ వదిలిన ఫోటోలు చూసి కుర్రాళ్లంతా ఉడికిపోయేలా ఉన్నారు. సోషల్ మీడియా ఈ ఇస్మార్ట్ పోరీ అందాలకు అందరూ ఫిదా అవుతున్నారు.అయితే తాను సినిమాలకు కొన్నాళ్లపాటు దూరకావడానికి కారణం యాక్సిడెంట్ అంటోంది. కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడు యాక్సిడెంట్ జరిగిందని.. భుజానికి తీవ్ర గాయం కావడంతో సినిమాలకు బ్రేక్ ఇచ్చానని తెలిపింది. ప్రస్తుతం ప్రియదర్శి జోడిగా డార్లింగ్ అనే సినిమాతో అడియన్స్ ముందుకు రాబోతుంది.ఈ సినిమా ప్రమోషన్లలో నభా నటేష్ మాట్లాడుతూ.. కెరీర్ మంచి పీక్స్ లో ఉన్నప్పుడే యాక్సిడెంట్ జరిగిందని.. ఓ రకమైన మైండ్ సెట్ లోకి వెళ్లిపోయానని.. కానీ ఆపరేషన్ అయిన పదిరోజులకే షూటింగ్ లో పాల్గొన్నానని తెలిపింది.






# 46కే ఆలౌట్

టాస్ గెలవడం... పరిస్థితులు ఎలా ఉన్నా బ్యాటింగ్ ఎంచుకొని భారీ స్కోరు సాధించడం... ఆపై ప్రత్యర్థిపై అన్ని రకాలుగా ఆధిపత్యం ప్రదర్శించి టెస్టును చేతుల్లోకి తెచ్చుకోవడం! సుదీర్ఘ కాలంగా సొంతగడ్డపై భారత జట్టు విజయసూత్రం ఇదే. అప్పుడప్పుడు ఆరంభంలో కాస్త తడబాటు ఎదురైనా తర్వాతి బ్యాటర్లు పరిస్థితిని చక్కబెడితే అంతా అనుకూలంగా మారిపోయేది. కానీ ఇప్పుడు కాస్త భిన్నమైన పరిస్థితి... ఈసారి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాం. కానీ పిచ్‌ను, వాతావరణాన్ని అంచనా వేయడంలో లెక్క తప్పాం... అనూహ్యంగా దూసుకొచ్చిన సవాల్‌ను ఎదుర్కొనే సన్నద్ధత లేక కుప్పకూలిపోయాం... మూడో రోజు న్యూజిలాండ్‌ను ఎంత వరకు నిలువరించి టెస్టును కాపాడుకోగలమో చూడాలి.

తొలి రోజు పూర్తిగా వర్షార్పణమైన భారత్, న్యూజిలాండ్ మొదటి టెస్టు రెండో రోజు ఊహించలేని మలుపు తీసుకుంది. వాన లేకపోవడంతో నిర్ణీత సమయానికే ఆట ఆరంభమైన ఆనందం ఒక్కసారిగా ఆవిరైంది. కివీస్ పదునైన పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోలేక భారత జట్టు చెత్త ప్రదర్శనతో అవమానకర రికార్డులను మూటగట్టుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 31.2 ఓవర్లలో కేవలం 46 పరుగులకే ఆలౌటైంది. స్వదేశంలో మన జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. రిషభ్ పంత్ (20; 2 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (13; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మ్యాట్ హెన్రీ (5/15), విలియమ్ ఓ రూర్కే (4/22) భారత్‌ను కుప్పకూల్చగా... సౌతీకి ఒక వికెట్ దక్కింది. అనంతరం న్యూజిలాండ్ ఆట ముగిసే సమయానికి 50 ఓవర్లలో 3 వికెట్లకు 180 పరుగులు సాధించింది. డెవాన్ కాన్వే (91; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... రచిన్ రవీంద్ర (22 బ్యాటింగ్), డరైల్ మిచెల్ (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం కివీస్ 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. దాదాపు ఒక్క సెషన్ సమయంలోనే కివీస్ పూర్తిగా పైచేయి సాధించింది. 1 పరుగు వద్ద అదృష్టవశాత్తూ 'అంపైర్ కాల్'తో బయటపడిన రోహిత్ (16 బంతుల్లో 2)ను సౌతీ ఎక్కువ సేపు నిలవనీయలేదు. కోహ్లి (0) లెగ్ గల్లీలో క్యాచ్ ఇవ్వగా, సర్ఫరాజ్ (0) మరో అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. 13/3 వద్ద వానతో కొద్దిసేపు అంతరాయం ఏర్పడగా... ఆట మళ్లీ మొదలైన తర్వాత యశస్వి జైస్వాల్ వెనుదిరిగాడు. ఆ తర్వాత 9 బంతుల వ్యవధిలో రాహుల్ (0), జడేజా (0), అశ్విన్ (0) పెవిలియన్ చేరారు. 34 స్కోరు వద్ద పంత్ ఫోర్ కొట్టడంతో భారత్ తమ ఆల్‌టైమ్ అత్యల్ప స్కోరును దాటగలిగింది. పంత్ అవుటయ్యాక మిగిలిన రెండు వికెట్లు తీసేందుకు కివీస్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. 7 పరుగుల వద్ద పంత్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను బ్లన్‌డెల్ వదిలేయకుండా ఉంటే భారత జట్టు పరిస్థితి ఇంకా ఎలా ఉండేదో!

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్:జైస్వాల్ (సి) ఎజాజ్ పటేల్ (బి) రూర్కే 13; రోహిత్ (బి) సౌతీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) రూర్కే 0; సర్ఫరాజ్ (సి) కాన్వే (బి) హెన్రీ 0; పంత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 20; రాహుల్ (సి) బ్లన్‌డెల్ (బి) రూర్కే 0; జడేజా (సి) ఎజాజ్ పటేల్ (బి) హెన్రీ 0; అశ్విన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; కుల్దీప్ (సి) (సబ్) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 2; బుమ్రా (సి) హెన్రీ (బి) రూర్కే 1; సిరాజ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (31.2 ఓవర్లలో ఆలౌట్) 46. వికెట్ల పతనం: 1-9, 2-9, 3-10, 4-31, 5-33, 6-34, 7-34, 8-39, 9-40, 10-46. బౌలింగ్: సౌతీ 6-4-8-1, హెన్రీ 13.2-3-15-5, ఓ రూర్కే 12-6-22-4.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 15; కాన్వే (బి) అశ్విన్ 91; యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33; రచిన్ (బ్యాటింగ్) 22; మిచెల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (50 ఓవర్లలో 3 వికెట్లకు) 180. వికెట్ల పతనం: 1-67, 2-142, 3-154. బౌలింగ్: బుమ్రా 10-4-23-0, సిరాజ్ 7-1-21-0, అశ్విన్ 11-1-46-1, కుల్దీప్ 12-1-57-1, జడేజా 10-0-28-1.

### షేక్ హసీనాకు
# బిగుస్తున్న ఉచ్చు



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. బంగ్లాదేశ్‌కు చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ వారెంట్ జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగారు. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో హసీనా భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాపై ఐసీటీకి 60కి పైగా కంప్లయింట్స్ వచ్చాయి. వాటిపై ట్రైబ్యునల్ దర్యాప్తు చేస్తోంది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ గతంలో పేర్కొన్నారు. హసీనాను బంగ్లాదేశ్‌కు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ భారత ప్రభుత్వాన్ని కోరింది.

# టాటా కొత్త నానో ఫీచర్స్ మైండ్ బ్లోయింగ్

సామాన్యులకు సైతం కారు ఉండాలనేది దివంగత బిజినెస్ మేన్ రతన్ టాటా కోరిక. అందుకే 2017లో కేవలం రూ. లక్ష రూపాయలతో నానో కారును అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే కొందరికి ఇది ఉపయోగకరంగా ఉన్నా.. చాలా మంది దీనిని లైక్ చేయలేదు. అందుకే కొన్ని సంవత్సరాలకే దీని ఉత్పత్తిని ఆపేశారు. టాటా కంపెనీ నుంచి ఎన్నో మోడళ్లు ఆ తరువాత వచ్చాయి.కానీ లక్ష రూపాయల రేంజ్ లో మరో కారు ఏ కంపెనీ తీసుకురాలేదు.అయితే ఇదే టాటా కంపెనీ ఇప్పటి తరానికి నచ్చేలా కాస్త హంగులు, టెక్నాలజీని జోడించి కొత్త నానోను తీసుకొస్తుంది. ఇప్పడంతా ఈవీ కార్లు అందుబాటులోకి రావడంతో దీనిని ఎలక్ట్రిక్ వెర్షన్ లో తీసుకొస్తున్నారు. దీని గురించి ఇప్పటికే అనౌన్స్ చేశారు. మరి ఇందులో ఫీచర్లు ఎలా ఉన్నాయంటే? రతన్ టాటా మరో కలల ప్రాజెక్టు పూర్తి కాకముందే ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. అయితే ఆయన లేకున్నా ఆయన ప్రాజెక్టులు మాత్రం ఆగడం లేదు. టాటా కంపెనీ నుంచి కొత్త నానో రావడానికి సిద్ధమవుతోంది. ఇది పూర్తిగా ఈవీ వెర్షన్. దీని గురించి ఇప్పటికే ప్రకటించారు. కానీ కొన్ని అంచనాల ప్రకారం కొత్త నానోను 2024 ఏడాది చివర్లో మార్కెట్లోకి తీసుకురావడానికి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.




అయితే ఇప్పుడు మార్కెట్లోకి వస్తున్న ఈవీలు ఒకదానికంటే ఒకటి భిన్నంగా ఉన్నాయి. మరి కొత్త నానో ఎలాంటి ఫీచర్లు, మైలేజ్, ధరను కలిగి ఉందోనని అందరికీ ఆసక్తి నెలకొంది. కొత్త నానో ఎలక్ట్రిక్ కారు మిగతా కార్లకు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇందులో 15 కిలో వాట్ బ్యాటరీ ప్యాక్ ఉండే అవకాశం ఉంది. దీనిని ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 312 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. దీని డిజైన్ ఆకట్టుకునే విధంగా ఉంది. కానీ పరిమాణంలో కాస్త చిన్నదిగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా ఇందులో 4గురు ప్రయాణికులు సౌకర్యవంతంగా వెళ్లొచ్చు. ఇందులో 7 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ ఉండనుంది. సౌండింగ్ కోసం 6 స్పీకర్లను అమర్చారు. పవర్ స్టీరింగ్, పవర్ విండ్ ఇందులోని ఫీచర్ల ప్రత్యేకత. యాంటీ లాకింగ్ బ్రేక్ సిస్టమ్ తో ఉన్న ఈ కారు 10 సెకన్లలో 100 కిలోమీటర్ల వరకు దూసుకెళ్లే సత్తా ఉంది. చాలా మంది కొత్త నానో కారు ధర ఎంత ఉండనుంది? అని చర్చించుకుంటున్నారు. గతంలో నానోను లక్ష రూపాయలకు అందించిన టాటా కంపెనీ దీని ధరను ఏ విధంగా ప్రకటిస్తారు? అని ఎదురుచూస్తున్నారు. అయితే టాటా కంపెనీ కొత్త నానో ధరను అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ దీనిని రూ.3 లక్షల ప్రారంభ ధరతో విక్రయిస్తారని తెలుస్తోంది. టాప్ ఎండ్ వేరియంట్ రూ.5 నుంచి 8 లక్షల వరకు ఉండనుంది. ప్రస్తుతం మార్కెట్లో అత్యంత తక్కువ ధరతో ఎంజీ కామెట్ రూ. 5 లక్షల ప్రారంభధరతో విక్రయిస్తున్నారు. దీని కంటే తక్కువ ధరకే టాటా నానో లేటేస్ట్ వెర్షన్ ను అందించనున్నారు.



# నేటి నుంచి హైదరాబాద్‌లో ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ పోటీలు

**తొలి రోజు బెంగళూరుతో టైటాన్స్, ముంబాతో దబాంగ్ ఢిల్లీ ఢీ**
**రా.8 నుంచి స్టార్‌స్పోర్ట్స్ లో లైవ్**

గ్రామీణ క్రీడకు కార్పొరేట్ హంగులు అద్ది అభిమానులకు మజాను అందిస్తూ.. ఆటగాళ్లను స్టార్లుగా మార్చిన ప్రొ కబడ్డీ లీగ్ రెండో దశాబ్దంలోకి అడుగు పెడుతోంది. పది ఎడిషన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న పీకేఎల్ 11వ సీజన్‌తో ఫ్యాన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. మెగా లీగ్ కొత్త ఎడిషన్ హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం మొదలవనుంది. పవన్ సెహ్రావత్ కెప్టెన్సీలోని తెలుగు టైటాన్స్, పర్దీప్ నర్వాల్ నాయకత్వంలోని బెంగళూరు బుల్స్ మధ్య తొలి మ్యాచ్‌తో కబడ్డీ కూతకు తెరలేవనుంది. రెండో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ కేసీ, యు ముంబా జట్లు తలపడనున్నాయి. ఈసారి హైదరాబాద్, నోయిడా, పుణె మూడు నగరాల్లోనే పోటీలు జరగనున్నాయి. 12 జట్లు బరిలో నిలిచిన లీగ్‌లో నవంబర్ 9వ తేదీ వరకు హైదరాబాద్ అంచె పోటీలు జరుగుతాయి. మెగా లీగ్‌ను భవిష్యత్తులో విదేశాల్లో నిర్వహించే ఆలోచన చేస్తున్నామని గురువారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న 12 జట్ల కెప్టెన్లు ట్రోఫీతో పోజిచ్చారు.

కొత్త టైటాన్స్‌ను చూస్తారు : కెప్టెన్ పవన్

గత మూడు సీజన్లలో చివరి స్థానంలో నిలిచిన తెలుగు టైటాన్స్ ఈసారి బాగా ఆడుతుందని కెప్టెన్ పవన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. నూతన కోచ్‌గా క్రిషన్ కుమార్ హుడా రావడంతో జట్టులో ఉత్సాహం వచ్చిందన్నాడు. ఈ సీజన్‌లో కొత్త టైటాన్స్‌ను చూస్తారని హామీ ఇచ్చాడు.



# హవాలా కేసులో తమన్నాను విచారించిన ఈడీ

నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్) కేసులో సినీనటి తమన్నా భాటియాను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. బిట్‌కాయిన్లు, ఇతర క్రిప్టోకరెన్సీల మైనింగ్ పేరిట పలువురిని మోసగించిన వ్యవహారంలో 'హెచ్‌పీజడ్ టోకెన్' మొబైల్ యాప్ పాత్ర ఉంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలపై తమన్నా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు ఈడీ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. యాప్ కంపెనీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తమన్నా కొంత సొమ్ము తీసుకున్నారని, అయితే ఆమెపై ఎటువంటి నేరారోపణ అభియోగాలు మోపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.



# ఢిల్లీ హెడ్‌కోచ్‌గా బదానీ

ఐపీఎల్‌లో ఇంతవరకూ ట్రోఫీ నెగ్గని జట్లలో ఒకటైన ఢిల్లీ క్యాపిటల్స్ 2025 సీజన్‌కు కొత్త హెడ్‌కోచ్‌ను నియమించుకుంది. భారత మాజీ క్రికెటర్ హేమాంగ్ బదానీ ఆ జట్టుకు వచ్చే సీజన్ నుంచి చీఫ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక బదానీ ఐపీఎల్‌తో పాటు పలు ఇతర లీగ్‌లలో జట్లకు బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. కాగా ఆంధ్రాకు చెందిన మాజీ క్రికెటర్ వేణుగోపాల్ రావు ఢిల్లీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమితుడయ్యాడు. భారత మాజీ సారథి సౌరవ్ గంగూలీని జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమిస్తున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.